క్లుప్తంగా

వైభవంగా సీతారామచంద్ర విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు



శావల్యాపురం: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో కొత్తగా సీతా లక్ష్మణ హనుమాన్ సమేత సీతారామచంద్ర స్వామి, ఉత్సవ బింబ జీవధ్వజ విమాన శిఖర గణపతి స్వాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను గ్రామస్తులు ఆదివారం నిర్వహించారు. ప్రతిష్ఠా వేడుకలు పరుచూరి హనుమంతాచార్యులు (గోపినాథ్) ఆగమ సిద్ధాంతి, వేదపండితుల సారథ్యంలో ఉదయం 6.58 గంటలకు వేదమంత్రాలు, మేళతాళాల మధ్య వైభవంగా నిర్వహించారు. స్వామిని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

కొచ్చర్ల అంకాల పరమేశ్వరి తిరునాళ్ల



ఈపూరు : కొచ్చర్ల గ్రామంలోని అంకాల పరమేశ్వరి తిరునాళ్ల ఆదివారం జరిగింది. భక్తులు అధికసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆరు భారీ విద్యుత్ ప్రభలు ఆకట్టుకున్నాయి. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

విజయ గ్రూప్ కొత్త కార్యాలయం ప్రారంభం



నరసరావుపేట: స్థానిక అరండల్‌పేటలోని బత్తిని హైట్స్ పక్కగా లైసెన్స్‌డ్ మున్సిపల్ ఇంజినీర్ వున్నం వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయ గ్రూప్ కార్యాలయం ఆదివారం ప్రారంభమైంది. పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పొడా) చైర్మన్ మిట్టపల్లి రమేష్, సాయి సూర్య డవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూనూరి కోటిరెడ్డి, పలువురు పట్టణ ప్రముఖులు హాజరై వేణుగోపాల్‌కు అభినందనలు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



వినుకొండ(నూజెండ్ల) : రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన నూజెండ్ల మండలం గుండ్లకమ్మ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. మృతుని వయసు దాదాపు 30 సంవత్సరాలు ఉండవచ్చని, నీలం రంగు టీషర్ట్, తెలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. యువకుడి ఆచూకీ తెలిస్తే స్థానిక రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

రేపు జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 9న కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఎన్‌ఏసీ ట్రైనింగ్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు సంస్థ జిల్లా అధికారి పి.ప్రణయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు మూడు కంపెనీలు హాజరవుతున్నట్టు వివరించారు. పదో తరగతి నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువత, ఐటీఐ, బీటెక్, ఫార్మసీ అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, పాస్‌పోర్ట్ ఫొటోలతో నేరుగా హాజరు కావాలని తెలిపారు. వివరాలకు ఎం.వీరాంజనేయులు 9160200652 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సాగర్‌మాత ఆలయంలో ప్రత్యేక పూజలు

విజయపురిసౌత్: శాంతి, సమాధానం, ప్రేమ, కరుణ భక్తులకు ప్రసాదించాలని ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాల సాగర్ అన్నారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. పరిశుద్ధాత్మ అయిన ఏసుక్రీస్తుకు జన్మను ప్రసాదించిన సాగర్‌మాత ఆశీస్సులు మీ అందరి యందున ఉంటాయని, ఆ తల్లిని భక్తి విశ్వాసాలతో పూజిస్తే కోరికలతో పాటు పాపాలు సైతం చెరిగిపోతాయని ఉద్బోధించారు. అనంతరం భక్తులు దేవాలయంలో తలనీలాలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆ తరువాత దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షిణలో భక్తులు పాల్గొన్నారు.

మార్కుల మెరుపదిగో

సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు



సూరె ప్రేమకుమార్ (581)



పల్లపాటి నాగసాయిశ్రీ యాదవ్(571)



కాల్వ చంటి (570)



మెడబలిమి గీష్మ(559)

శావల్యాపురం/నాదెండ్ల: పదో తరగతి ఫలితాల్లో సర్కారు బడులు సత్తాచాటాయి. మండలంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినట్లు ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు ఆదివారం తెలిపారు. శావల్యాపురం జెడ్పీ పాఠశాల విద్యార్థి సూరె ప్రేమకుమార్ 581 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్టు వివరించారు. వేల్పూరు హైస్కూల్లో పాఠశాల పేరెంట్ కమిటి చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు కుమార్తె నాగసాయిశ్రీ 571 మార్కులు సాధించి రెండోస్థానంలో నిలిచినట్టు చెప్పారు. మతుకుమల్లి హైస్కూల్ విద్యార్థి కాల్వ చంటి 570 మార్కులతో మూడో స్థానం సాధించినట్టు వివరించారు. పోట్లూరు హైస్కూలు విద్యార్థి మెడబలిమి గీష్మ 559 మార్కులతో నాలుగో స్థానంలో నిలిచారని వెల్లడించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు, కె.విజయ్‌భాస్కర్‌రావు, జంగాల అనిత, శంకరరంగారావు తదితరులు విద్యార్థులను అభినందించారు.

■ వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 17 మంది విద్యార్థులు 500పైబడి మార్కులు సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగాల అనిత మాట్లాడుతూ తమ విద్యార్థులు పల్లపాటి నాగసాహితీ 571, తాళ్ళూరి శుభకర్ 553, కాకర్ల అమూల్య 551, సూరబత్తిని సాయి వెంకట శశిధర్ 550, కరణం వెంకట సాయి 549, గాలం శ్రావణ సంధ్య 538, రేతినేని శరణ్య 532, కామేపల్లి వెంకటేశ్ 531, సాదినేని నవీన్ 531, పుట్టా సందీప్ 528, బోయపాటి గౌతమ్ 527, దొప్పలపూడి జెస్సిక 522, రాంపల్లి షాలిని 521, కుంభా గౌరి 518, జగం స్రవంతి 514, దన్నవరపు గౌతమి 513, మేడిబోయిన హరీష్‌కుమార్ 501 మార్కులు సాధించినట్లు చెప్పారు.



గణపవరం జెడ్పీహైస్కూలులో టాపర్‌గా నిలిచిన నాగయశ్వంత్‌ను అభినందిస్తున్న దృశ్యం

■ నాదెండ్ల మండలంలోని 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుండగా గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రత్తిపాటి నాగయశ్వంత్ పదో తరగతి ఫలితాల్లో టాపర్‌గా నిలిచాడు. 600 మార్కులకు గాను 578 మార్కులు సాధించాడు. ఇదే పాఠశాలకు చెందిన కందుకూరి నవీన్ 575 మార్కులతో రెండో స్థానంలో నిలిచాడు. మండలం నుంచి 682 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 458 మంది (67.16 శాతం) ఉత్తీర్ణత సాధించారు. చిరుమామిళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 98.61 శాతం ఫలితాలతో మొదటి స్థానంలో నిలిచింది. ఏపీ మోడల్ పాఠశాల 87.50 శాతం, సంకురాత్రిపాడు జెడ్పీహెచ్ఎస్ 84.00 శాతం, ఎండుగుంపాలెం జెడ్పీహెచ్ఎస్ 67.74, కనపర్రు 66.67, గణపవరం 63.1, తూబాడు 62.22, సాతులూరు 57.61, అమీన్‌సాహెబ్‌పాలెం 54.29, నాదెండ్ల 47.69, నాదెండ్ల కేజీబీవీ 46.15 శాతం ఉత్తీర్ణత సాధించాయి.



చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

చిరుమామిళ్ళ జెడ్పీ పాఠశాల ప్రభంజనం

నాదెండ్ల మండలం చిరుమామిళ్ల నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి ఉత్తీర్ణత శాతంలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. 98.61 శాతం ఉత్తీర్ణత సాధించారు. 72 మందికి 71 మంది ఉత్తీర్ణతులయ్యారు. గత రెండేళ్ల 2017-18, 2018-19 విద్యా సంవత్సరాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించి ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి ఇక్కడి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అదనపు ఆహారం, ప్రభుత్వం అందించే జగనన్న విద్యాకానుకతో పాటూ అదనపు నోటు పుస్తకాలు, అదనపు జత యూనిఫాం అందిస్తున్నారు. లైబ్రరీకి అవసరమైన పుస్తకాలు, ఆట వస్తువులు సమకూరుస్తున్నారు. పదో తరగతి పిల్లలకు అదనపు క్లాసులు నిర్వహించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు విద్యా వలంటీర్లను కూడా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో మాలె శ్రీనివాస్ 564 మార్కులతో పాఠశాల టాపర్గా నిలిచాడు.

గ్రామసింహాల బెడద



బొల్లాపల్లి : మండలంలోని రావులాపురం గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గేదెలపై దాడి చేసి గాయపరిచాయని, గ్రామానికి చెందిన రెండు గేదెలు కుక్కలదాడిలో గాయపడి చికిత్స పొందుతూ చనిపోయాయని గ్రామస్తులు చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు వీధుల్లో తిరగాలంటే బెంబేలెత్తుతున్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులకు శ్రీకారం

ఏఈ వెంకటేశ్వరస్వామి



శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు గ్రామం ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి మార్గంలో రూ.10 లక్షలతో చేపట్టిన నూతన కల్వర్టు పనులు తుది దశకు చేరినట్లు పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి ఆదివారం చెప్పారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో కల్వర్టు పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వేల్పూరు గ్రామంలో ఎన్నెస్పీ కాలువ కుడి వైపు రూ.40 లక్షలతో 500 మీటర్ల సిమెంటు రోడ్డు పనులు త్వరలో ప్రారంభించుతున్నామని వెల్లడించారు. పొట్లూరు గ్రామంలో రూ.50 లక్షలతో ప్రధాన రహదారి మార్గం నుంచి ఎస్సీ కాలనీ వరకు 600 మీటర్ల వరకు సీసీ రోడ్డు పనులు పూర్తి చేశామని వెల్లడించారు.

వైభవంగా లక్ష్మీగణపతి ఆలయ ప్రతిష్ఠ



గుర్రంపై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేటలో మసీద్, మదర్సాలకు స్థలం ఇచ్చిన దాత ఇస్మాయిల్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

రొంపిచర్ల : ఎడ్వర్డ్‌పేట గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి స్వామి కీర్తింబ ఆలయ పరివార దేవతా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రతిష్ఠ, పరివార దేవత విగ్రహాల, ధ్వజ స్తంభం ప్రతిష్ఠా మహోత్సవం జరిగింది. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆలయాన్ని సందర్శించి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి విచ్చేసిన గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు స్వాగతం పలికారు. గ్రామంలో గుర్రం మీద ఊరేగించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామస్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆడపడుచులు, బంధువుల రాకతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా తమ పుట్టిళ్లకు వచ్చిన ఆడపడుచులకు గ్రామస్తులు కొత్త వస్త్రాలను బహూకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదానం జరిగింది. రాత్రి వేళల్లో ఆలయ ఆవరణలో భజన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి, సర్పంచ్ జిడ్డు యర్రయ్య, మాజీ సర్పంచ్ కోడూరి వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల నాయకులు కురుగంటి శ్రీనివాసరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి, దాడిపర్తి సీతయ్య, గాదె రామిరెడ్డి, కాశినేడి మస్తానయ్య పాల్గొన్నారు.

మసీద్-మదర్సా నిర్మాణానికి భూమిపూజ

నరసరావుపేట: పట్టణంలోని ఆరో వార్డులో కొత్త మసీద్, మదర్సా నిర్మాణాలకు ఆదివారం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. స్థలాన్ని ఇచ్చిన దాత షేక్ హాజీ ఇస్మాయిలును దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, ఎస్‌జేఎస్ బాజీ, జాఫర్, వరవకట్ట బాబు,పలు మసీద్‌లకు చెందిన ఇమామ్‌లు, ముస్లిం మత పెద్దలు, పట్టణ మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు చైర్మన్‌కు సన్మానం



రామకృష్ణను సన్మానిస్తున్న బీసీ సంఘాల నాయకులు

రొంపిచర్ల : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఇటీవల చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బత్తుల రామకృష్ణను ఆదివారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు మాట్లాడుతూ మార్కెట్ యార్డు ఏర్పాటు చేసిన తరువాత బీసీలకు చైర్మన్‌గా అవకాశం కల్పించటం హర్షణీయమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం బీసీలు రాజకీయపరంగా ఎదిగేందుకు కృషి చేస్తోందని చెప్పారు. మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. బీసీ వర్గానికి చెందిన తనను యార్డ్ చైర్మన్‌గా నియమించిన డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తానన్నారు. అనంతరం రామకృష్ణను బీసీ సంక్షేమ సంఘం నాయకులు దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తన్నీరు శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ బొజ్జా శ్రీనివాసరావు, మాలమహానాడు జిల్లా నాయకులు దొప్పలపూడి దిబ్బయ్య, బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు ముక్కడాల వెంకటేశ్వరరావు, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, బత్తుల మీరయ్య, ఒంటిపులి పేరయ్య, చక్రవరం సత్యనారాయణరాజు, బండారు వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల మనసు దోచిన కవి ఆత్రేయ



ఆత్రేయ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సాహితీవేత్తలు

చిలకలూరిపేటటౌన్: నాటక రచయితగా, సినీ గేయ రచయితగా ఆత్రేయ గొప్ప పేరు సంపాదించారని రాష్ట్ర అధికారభాషా సంఘం సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు చెప్పారు. ఆదివారం జనవిజ్ఞాన వేదిక, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆచార్య ఆత్రేయ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆత్రేయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగువారి మనసుల్లో ఆత్రేయ రచనలు చెరగని ముద్ర వేశాయని కొనియాడారు. అనంతరం సోమవారం నుంచి శాఖ గ్రంథాలయంలో ప్రారంభం కానున్న విద్యార్థులకు వేసవి విజ్ఞాన వినోద కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పీవీ సుబ్బారావు, దార్ల బుజ్జిబాబు, ధారా కొండయ్య, చుక్కా వెన్నెంట్‌పాల్, గ్రంథాలయ ఇన్‌చార్జి నాగుల్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

మహా యోధుడు అల్లూరి



యడ్లపాడులో అల్లూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

చిలకలూరిపేట/యడ్లపాడు: స్వాతంత్ర్య పోరాటం కోసం ప్రాణత్యాగం చేసిన మహాయోధుడు అల్లూరి సీతారామరాజు అని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ చెప్పారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న సంఘ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీనునాయక్ మాట్లాడుతూ 27 ఏళ్ల వయసులో నిరక్షరాస్యులైన గిరిజనులను స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి భాగస్వాములను చేశారని కొనియాడారు. సామాన్యులతో కలసి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారని పేర్కొన్నారు. అలాంటి విప్లవ యోధుడిని నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుంభా నాగేశ్వరరావు, బి.చిన్నా నాయక్, బి.రాంబాబునాయక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

■ యడ్లపాడు శాఖా గ్రంథాలయంలో ఆదివారం అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నిర్వహించారు. గ్రంథాలయం అధికారి సీహెచ్ అంజమ్మ అల్లూరి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎన్.సంజీవరావు, బి.తేరేజమ్మ, బాబు, పాఠకులు పాల్గొన్నారు.

బ్రహ్మ 'రథం'



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నాదెండ్ల: నాదెండ్లలో కొలువైన గంగాపార్వతీ సమేత మూలస్థానేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈనెల 2 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామి కల్యాణం, నంది వాహన సేవ, పొన్నమాను వాహన సేవలు నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఈ ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించటం ఆనవాయితీ. ఇదే ఆలయంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతం శివనామస్మరణతో మార్మోగింది. అనంతరం దొంగలదోపోత్సవం, గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేటటౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్‌చేసి అతని వద్ద నుంచి 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు ఆదివారం తెలిపారు. మార్కెట్ సెంటర్ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామని తెలిపారు. అక్కడ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న శివశంకర్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి తమిళనాడు రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి నిందితున్ని కోర్టులో హాజరు పరచినట్టు ఎస్ఐ తెలిపారు.

గ్రంథాలయంలో వేసవి వినోదం శిబిరం

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ సహకారంతో పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఈనెల 8 నుంచి జూన్ 11 వరకు పాఠశాలల విద్యార్థులకు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి వై.రాధ ఆదివారం తెలిపారు. శిబిరంలో కథలు వినటం, పుస్తక పఠనం, సమీక్షలు, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు.

నిదానంపాటి అమ్మవారికి పూజలు

దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న నిదానంపాటి అమ్మవారికి ఆదివారం ప్రత్యేకంగా పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి బోనాలు సమర్పించారు. అమ్మవారికి కుంకుమబండ్లు కట్టి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

సామూహిక ఉపనయనాలు



సామూహిక ఉపనయనాలు కార్యక్రమంలో ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు

చిలకలూరిపేట: ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని విజ్ఞాన్ విహార్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో సామూహిక ఉచిత ఉపనయన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఈ కార్యక్రమం కొనసాగింది. సమితి గౌరవ అధ్యక్షుడు చల్లా హనుమత్ విజయకుమార్ మాట్లాడుతూ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామూహిక ఉపనయన కార్యక్రమానికి సహకరిస్తున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ముత్తనపల్లి శివరామకృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్.హనుమత్‌శాస్త్రి, సమితి అధ్యక్షుడు ఏకా మారుతీశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత, బంధాల బలోపేతానికి కృషి



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

చిలకలూరిపేటటౌన్: మనుషుల మధ్య, ఐక్యత, బంధాల బలోపేతానికి సనా సొసైటీ కృషి చేస్తోందని ఆ సంస్థ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్‌అలి చెప్పారు. పట్టణంలోని షాలుబుడే షాదీఖానా వెనుక కమ్యూనిటీ హాలులో ఆదివారం సనా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సమావేశం జరిగింది. అలి మాట్లాడుతూ సుమారు దశాబ్దన్నర కిందట తమ సంస్థను స్థాపించామని, ఆపత్కాలంలో అనేక ముస్లిం కుటుంబాలకు అండగా నిలిచామని పేర్కొన్నారు. సంస్థ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. దీనికోసం ఆదివారం 100 మందిని సంస్థ సభ్యులుగా తీసుకున్నట్లు వివరించారు. ముఫ్తి పఠాన్ అనస్‌ఖాన్, షేక్ నజీర్ అహమ్మద్, షేక్ కరీముల్లా, షేక్ రఫీ, పఠాన్ నజీర్‌ఖాన్, షేక్ అబ్దుల్ రెహమాన్(కాటన్), వేటపాలెం సుభాని, ఫెయిత్ ఫారూఖ్, షేక్ నాసిర్, ఉపాధ్యాయులు అబ్దుల్ రెహమాన్, ఆడిటర్ షేక్ సలీలం సంస్థ భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. కళామందిర్ సెంటర్ హైస్కూల్స్ రోడ్‌లోని నివాసితులు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసి సనా సంస్థ తరుపున ఆర్థిక చేయూతనందించారు.

ఆర్‌బీకేల ద్వారా వరి, మొక్కజొన్న కొనుగోలు



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఏఓ అంజిరెడ్డి

వినుకొండ(నూజెండ్ల) : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వినుకొండ మండలంలోని నరగాయపాలెం, పెదకంచర్ల, ఏనుగుపాలెం గ్రామాల్లోని పంటలను తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి కె.అంజిరెడ్డి ఆదివారం పరిశీలించారు. పంట నష్టం ఏమైనా ఉన్నట్టయితే ఆర్‌బీకేల్లో తెలియజేయాలని సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ రంగు మారిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తామని, ధాన్యం క్వింటాకు గ్రేడ్-ఏ రకం రూ.2,060, సాధారణ రకం రూ.2,040 కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే మొక్కజొన్న పంటను విక్రయించాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో సమాచారం అందజేసినట్లయితే క్వింటా రూ.1,962కు కొనుగోలు చేయనున్నట్లు వివరించారు. వరి పంట ఒరిగిన లేక నేల వాలిన, తడిచిన, రంగు మారిన వెంటనే ఐదుశాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేసుకోవాలని సూచించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నరసరావుపేట రూరల్: పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి, స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని పెదరెడ్డిపాలెంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. పెదరెడ్డిపాలెంతోపాటు సమీప గ్రామాల నుంచి కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 250 మంది శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. వైద్యులు వీరికి పరీక్షలు నిర్వహించి 140 మంది కంటి శుక్లాల శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. ఈనెల 8, 10 తేదీల్లో శంకర కంటి వైద్యశాలలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని, వైద్య శిబిరం కో-ఆర్డినేటర్ సైదులు తెలిపారు. కార్యక్రమంలో శంకర కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వి.స్పందన, డాక్టర్ నీరజ, ఫౌండేషన్ ప్రతినిధులు సూదులగుంట్ల హనుమంతురావు, అబ్బూరి శ్రీనివాసరావు, సర్పంచ్ ఇండ్లమూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.